


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### బాజాభజంత్రీలు

**భువనచంద్రగారు** ఫోన్ చేసారు "పెళ్ళి పనులు ఎంతదాకా వచ్చాయి బాలాజీ?" అన్నారు.

"ఏదో అవుతున్నాయి . ఆడపెళ్ళివారి పనులు కూడా మనమే చెయ్యాలి. తెలుగు పద్ధతులు తెలీవు పాపం" అన్నాను.

అక్కడినుండి ఇద్దరం కాస్త పాత రోజుల్లోకి వెళ్ళాం. "అసలు ఈ రోజుల్లో పెళ్ళిళ్ళకి చడీచప్పుడు ఉంటడంలేదు" అంటూ.

అవును మా ఇళ్ళల్లోనే ఇద్దరు అక్కల పెళ్ళిళ్ళప్పుడు జరిగిన ఆర్భాటాలు అంతా ఇంతా కావు. మంథర పిన్ని అసలు పెళ్ళిళ్ళకి వచ్చేదే తగవులు పెట్టడానికి. ఉన్నది ఆడపెళ్ళివారి తరఫున అయినా, టైం చూసుకుని విడిదింట్లోకెళ్ళి నాలుగు అవ్వాయి తువ్వాయిలు వేసొచ్చేది.

సరిగ్గా భోజనాలవేళ మగపెళ్ళివారి తాలుకు వరుసకి మావయ్య లేదా బాబాయ్ ఎవడో "ఆడపెళ్ళివారు తినేసాక ఆకుల్లో మిగిలింది తినాలా? మాకు అఖ్ఖర్లేదు" అని లేచేవాడు.

దాంతో పెళ్ళికొడుకు అమ్మా, నాన్నా, అక్కా, బావా అక్కచెల్లెళ్ళూ అంతా వంత పాడాల్సిందే. ఒకవేళ వాళ్ళు ఎవరైనా సర్దిచెప్పబోతే "మీకంత గతికాలిపోతే మీరు తినండి" అనే అస్త్రం వాడేవారు. దాంతో వాళ్ళు రెచ్చిపోయి, ఎవరినీ తిననివ్వకుండా, వాళ్ళూ తినకుండా గొడవ. ఎందుకు గొడవ మొదలయిందో ఇంతకీ వాళ్ళకీ పూర్తిగా తెలీదు. తీరా ఎవరైనా తెలివైన మధ్యవర్తి వెళ్ళి, సంగతి కనుక్కుంటే ఆడపెళ్ళివారు మగపెళ్ళివారి కన్నా ముందే బంతిలో కూర్చుని భోంచేసారని విషయం తెలుస్తుంది.

ఇంతా చేస్తే ఎవరో ఇల్లాలు పసిపిల్లవాడికి అన్నం కలిపి, వాడు వదిలేసిపోతే, అది నోట్లో వేసుకుందనీ, అదే సమయంలో మంథర పిన్ని ఎక్స్‌రే కళ్ళల్లో ఇది పడి, మగపెళ్ళివారి విడిదికి పరిగెత్తిందనీ తేలేది. పర్యవసానం పెళ్ళిలో బాజాభజంత్రీలు అక్కర్లేకుండా లక్ష్మీ ఔట్లూ, థండర్ బాంబులూ పేలేవి.

ఓ పెళ్ళిలో మగపెళ్ళివారి వడ్డనలు అవుతుండగా పదహారునుండి ఇరవైలోపు సీతాకోకచిలుకల్లాంటి వయసులో వున్న ఆడపిల్లలు వడ్డన చేస్తుండగా మగపిల్లలు నయనానందం అనుభవిస్తుండగా, బంతి చివరనుండి ఓ ముసలాయన 'టయ్యిన' లేచి "ఎవరైనా పద్ధతీ పాడూ వున్నవాడు ఈ వడ్డన తింటాడండీ?" అని కాళ్ళల్లో నిప్పులూ, కళ్ళల్లో కారం కొట్టినట్లు చిందులు తొక్కాడు. వడ్డిస్తున్న పిల్లలు బిత్తరపోయారు.

"ఏవైందయ్యా?" అని శాంతపరచి అడిగితే.

ఆయన పచ్చిమిరపకాయకొరికినట్లు చిందులు వేస్తూ "పప్పు పక్కన కూరలు వడ్డించే విధానం ఇదా? పచ్చళ్ళు ఎక్కడెయ్యాలో తెలీని కుర్రకుంకల్ని వడ్డనకి పంపితే ఇలాగే వుంటుంది. శాస్త్రం తెలిసినవాడు తింటాడా?" అంటూ, జయమాలినికీ, హలానికీ పంచెకట్టి వదిలినట్టు చిందులేస్తున్నాడు.

మగపెళ్ళివారి తాలూకు వారికి వరుసకి చిన్నతాతయ్యట. ఈయన లేచిపోతే, మర్యాదకి ఈయనతోపాటు లేచిపోడానికి మిగతావాళ్ళూ మొహమాటంగా చూస్తున్నారు. అరిటాకులో నేతి పూర్ణాలూ, ఘుమఘుమలాడ్తున్న పులిహోరా, దానిపక్కనే ఎర్రగా వూటకార్తున్న దోసావకాయా, కందిపొడీ, అప్పడాలూ వడియాలూ, గోంగూరపచ్చడీ, ఈ కందాబచ్చలీ, వంకాయకారం పెట్టిన కూరా పొరపాటుగా ఆకులో పడిన కారణంగా, అదీ కుడివైపున పడవలసినవి ఎడమవైపున పడి, లడ్డూ, పరమాన్నంతో నెయ్యం చేసిన కారణాన ఇంతటి, మతాంతర వివాహంలాంటి ఘోరం ఏదో జరిగిపోయినట్లు ఈ ఛాంధస ముసలాడు చిందులేస్తుంటే, తెల్లగా విచ్చుకుని మల్లెమొగ్గల్లా ఆహ్వానిస్తున్న అన్నం మీద అపురూపమైన నేతిబొట్టు 'పడనా వద్దా' అని బిక్కచచ్చిపోయి చూస్తోంది.

మొత్తం మగపెళ్ళివారిలో ముఖ్యులు కూర్చున్న ఆ బంతి అంతా తప్పదన్నట్లు, ఆయన పాటకి వంతపాడ్తూ లేచి నిలబడ్డారు. మిల్ట్రీ చిన్నాన్న గబగబా వచ్చి, ముసలాయన మణికట్టు దగ్గర పట్టుకుని "బాబాయ్‌గారూ.. మీరు వయసుకి పెద్దవారు ఇలాంటివి కడుపులో పెట్టుకోవాలి. మీ పిల్లల్లాంటివాళ్ళం.." అని చెవిలో ఏదో చెప్పి "మీ కాళ్ళు పట్టుకోమంటారా?" అని అందరికీ వినపడేట్లు అడిగేసరికి, ఆయన తగ్గిపోయి "అదే. అదే. పిల్లమూకకి అప్ప చెపితే ఎలా వడ్డన?" అంటూ ఆకు ముందు కూర్చున్నాడు. అందరూ స్థిమితపడి, "నెయ్యి చిలకరించమ్మా" అంటూ పదార్థాల మీదకి దండయాత్ర ప్రారంభించారు.

ఇంతకీ మిల్ట్రీ చిన్నాన ఆయన చెవిలో చెప్పిన తారకమంత్రం ఏమిటంటే "లం..కొడకా.. కూర్చుంటావా? గేటు దాటాకా కాళ్ళు విరగ్గొట్టమంటావా?" అని మణికట్టు చిట్లిపోయేటట్లు పట్టుకుని, చెవిలో హెచ్చరించి, పైకి "మీరు పెద్దవారు.. అన్నీ తెలిసినవారు.. అర్థం చేసుకోండీ!" అని బతిమాలుతున్నట్లు చేస్తే, దెబ్బకి దెయ్యం దిగిపోయి ముసలాయన కూర్చున్నాడు. అప్పటికే భోజనాలవేళ దాటి మధ్యాహ్నం మూడు అవుతోంది మరి.

కొన్నిసార్లు ఇలా సామదానబేధాలు పనిచేయకపోతే నాలుగోరకం వాళ్ళుండాలి మరి.

ఇంకోసారి, మగపెళ్ళివారు తరలి వచ్చారు. ఆడపెళ్ళివారు, బొట్లు పెట్టి, పన్నీరు జల్లి, హారతిచ్చి ఆహ్వానిస్తుండగా, మగపెళ్ళివారిలో కాలివేలో చేతివేలో విడిచిన మేనత్త ఒకావిడ మొహం జేగురు రంగులోకి మార్చుకుని "పదండి వెనక్కి పోదాం.. జరిగిన మర్యాదలు చాలు.." అని రంకె వేసింది.

"ఏవైంది పిన్నిగారూ?" అని పెళ్ళికూతురు తల్లి జబ్బమీద చెయ్యివేస్తే, "జబ్బ అట్టుకుతోసేస్తారా?" అని శోకాలు మొదలెట్టింది. మొత్తం మగపెళ్ళివారంతా ఒకవైపూ, ఆడపెళ్ళివారంతా ఒకవైపూ కురుక్షేత్ర సంగ్రామంలోలాగా నిలబడి, కంఠనాళాలు తెగిపోయేట్లు అరుచుకుంటూ, కాళ్ళు తొక్కుకుంటూ కథాకళీలూ, శివతాండవాలూ చేసేసాకా, ఎవడో మధ్యవర్తి తెలివిగా "ఏం జరిగిందసలు?" అని కూపీలాగితే "చీపురు తలవైపు నేలకి ఆన్చి, తోకవైపు పైకి పెట్టి, మాకు స్వాగతం చెప్తారా? మేం అంటే అంత అలుసా? కావాలనే చీపురు మాకు ఎదురుగా పెట్టారు" అని జేగురు రంగు మొహం ఆవిడ విషయం చెప్పింది.

అప్పుడో తెలివైన ఆయన "అయ్యో చీపురు శ్రీ మహాలక్ష్మి తల్లీ అది ఎదురుగా వుంటే శుభం" అని నచ్చచెప్పి లోనికి తీసుకురాకపోతే, పెళ్ళే కాన్సిల్ అయిపోయేది.

మరొక పెళ్ళిలో పెద్ద వదినగారు, ఎదుర్కోలు అయిరాగానే, కొంగు మొహానికి అడ్డం పెట్టుకుని గొల్లు గొల్లున ఏడ్చి మొహం అంతా ఎర్రగా బూరెలా పొంగిపోయాక, అందరూ చుట్టూ చేరి "ఏం జరిగింది? పెళ్ళివారు ఏం అమర్యాద చేసారో చెప్పు తేల్చుకుంటాం" అంటే, "పేలాల గంప తెప్పించలేదు" అని చెప్పింది.

దాంతో పెళ్ళి కొడుకు కాస్త నోరుగలవాడు కనక "వదినా రేపు పదిగంపల పేలాలు తెప్పిస్తాను. ఇప్పుడు చప్పుడు చెయ్యకుండా కూర్చో" అని గదిమాడు.

మా ఇంట్లో ఇచ్ఛాపురం మామయ్య అలగడానికి పెట్టింది పేరు. నా పెళ్ళిలో ఎక్కడికో వెళ్ళి రాత్రి చాలా ఆలస్యంగా వచ్చి ఆఖరి బంతిలో తిని "దద్ధోజనం చేయించారుటగా? అయిపోయిందా? ఇవేం వడ్డనలూ? పెరుగు అన్నం నేను మాత్రం కలుపుకుని తినాలా?" అందరూ దద్ధోజనం తింటే.. ఇదేం పెళ్ళి?" అని అరిచి గెంతులేసాడు.

మా అన్నయ్య కొడుకు పెళ్ళికి పొరుగూరు వెళ్ళి, "బాత్‌రూంలో సబ్బు పెట్టలేదు. ముందుగా చెపితే తెచ్చుకునేవాళ్ళంగా!" అని కళ్ళెర్రచేసి, కేకలేసాడు.

రైలు దిగీదిగగానే, విడిదిలోకి అడుగుపెట్టి "వచ్చి ఇంతసేపయింది కాఫీలేవీ? వేడినీళ్ళు గొంతులో పడకపోతే కాలకృత్యాలెలా?" అని మొదలుపెట్టాడు.

ఓసారి భోజనాలకి కూర్చుని "అన్నం వడ్డించగానే నెయ్యి తీసుకురావద్దూ? పైగా అలా లక్కపిడతలో తెచ్చి ఆచమానంలా వడ్డిస్తారేవిటి?" అని రంకెలేస్తుంటే, అత్తయ్య అంటే ఆయన ధర్మపత్ని చెవిలో "ఇది మనింట్లో పెళ్ళే.. అంతే వేస్తారు. నోర్మూసుకుని తినండి" అంది. ఆయన అలవాటులో పొరపాటుగా అది ఎవరిల్లో చూడలేదు.

అసలు ఈ పెళ్ళిళ్ళల్లో అచ్చంగా అలగడానికే ఓ బ్యాచ్ ఉండేది.

నిన్న అనగా పెళ్ళివారింటికొచ్చి 'అచ్యుతం పిన్ని ఇంకా అలగలేదేవిటి?' అనుకునేవాళ్ళం.

"పూలదండలో దారమేకానీ పూలేవీ? మినపసున్నిలో బెల్లమేగానీ నెయ్యేదీ? వంకాయకూరలో జీడిపప్పు బదులు పల్లీ పప్పులేసారు. అంతలేనివాళ్ళా? అదేవిటమ్మా ఆవిడ చీరలో రవికెల గుడ్డ పెట్టలేదూ? పసుపురాస్తే రెండు చేతులతోటీ పాదం పట్టుకురాయొద్దూ? కాఫీ ఏవిటీ కుడితిలావుందీ? ఉప్మాలేవిటీ, పెసరట్టూ అల్లం పచ్చడీ చెలికత్తెలు లేకుండా? దోసావకాయలో ఆవ తగ్గిందే? కాటుక ఏవిటీ మొహం అంతా పారుతోంది? పెరుగేవిటీ నీళ్ళలా వుందీ? పప్పేవిటీ విస్తట్లో పరుగెడ్తోంది? అప్పడాలు చూరలా వున్నాయే? ఎవరింట్లో పెళ్ళిలోవీ?" ఇలా అచ్యుతం అత్తయ్య వంక పెట్టని విషయమే ఉండేదికాదు.

ఇంక వియ్యపురాలూ, వియ్యంకుడూ అయితే ఆ వేళే ప్రమాణస్వీకారం చేసిన ప్రధానమంత్రి పదవొచ్చినట్లు, మొహం అంతా ఒకలాంటి దర్పం పూసుకుని, నవ్వితే కొంపేదో మునిగిపోతుందేమో అన్నట్లుగా ముఖాలు పెట్టుకుని "మగపెళ్ళివారి గది.. ఇటువైపు రాకండి. మగపెళ్ళివారి సామాన్లు. వీటిని తాకకండి. మగపెళ్ళివారి పూలు.. మగపెళ్ళివారి ఫలహారాలు" అంటూ ప్రత్యేకంగా చూడకపోతే వాటిని కన్నెత్తైనా చూడరు.

ఇక అందర్లోకీ ప్రధాన భూమిక ఆడబడుచు. ఆడబడుచు లాంఛనాలతోబాటు అలక తీర్చే ఇద్దరు మనుషులని కూడా పెళ్ళివారు ప్రత్యేకంగా పెట్టాలి. "మా అబ్బాయి ఏడుస్తున్నాడు. పసివాడికి పాలైనా ఇవ్వలేదమ్మా ఆడపెళ్ళివారూ?" అని రాగం మొదలుపెట్టచ్చు. తీరా పాలు తెస్తే "ఆవుపాలు తప్ప ఏవీ పట్టం. మా అబ్బాయికి జబ్బుచేస్తుంది" అని మళ్ళీ రాగం. అలాంటి ప్రత్యేకమైన అలవాట్లున్నప్పుడు ముందే చెప్పాలన్న జ్ఞానం ఉండదు.

మా ఇంట్లో ఒకావిడ పెరుగుకాస్త పుల్లగా వున్నా, మజ్జిగ పలుచగా వున్నా, తన కూతురైందీ చూడదు. శివాలూ, చిందులే! "అమ్మా ఇది మనిల్లే నీ మనవరాలి పెళ్ళి" అని కూతురు చెప్పినా ఆవిడ అలిగి, చెప్పులేసుకుని అంట చేత్తో వెళ్ళిపోతుంది.

పదిమంది ఓ చోట చేరి వేడుక చేసుకునేదే సరదాల కోసం. ఆ సరదా మానేసి "మేం మగపెళ్ళివారం. మేం ముందు తినాలి. మా ముందు ఆడపెళ్ళివారు చేతులు కట్టుకుని నిలబడాలి. ఆడపెళ్ళివారు ఎంత ఘనంగా ఏర్పాట్లు చేసినా వారికి వంకలు పెట్టి, అవమానం చెయ్యాలి" అని ఇదివరకట్లో కొన్ని రూల్స్ ఉండేవి అనుకుంట.

మాయాబజార్లో కూడా శకుని "ఆడపెళ్ళివారిని అల్లరి చెయ్యకుండా నన్ను అల్లరి చేస్తున్నారేమిటి?" అంటాడు. పెళ్ళికూతురు తల్లీ తండ్రీ గజగజలాడిపోతూ, లేదా ఏడ్చి మొహం ఉబ్బిపోయి, పెళ్ళిపందిట్లో కనిపించేవారు. ఆ ముఖాలు పిల్లని పంపిస్తున్నాం అని కాదు "మగపెళ్ళివారు ఎప్పుడు వెళ్తారా? అని"

ఇదివరకు "పెళ్ళికి ఎంతమందిని పిలుస్తున్నారు? ఎంతమందికి వండించాలి?" అని అడిగితే తప్పు. ఆడపెళ్ళివారిని అల్లరిచెయ్యడానికి కొంతమంది రెండొందలమందిమి వస్తాం అని రెండువేలమంది వచ్చి వడ్డన అందలేదని గలాటా చేయడం కూడా జరిగేది.

బీదవాళ్ళ పెళ్ళి శుభలేఖ ఒకటి, స్వాతంత్రం రాకముందుది ఫేస్‌బుక్‌లో చూసాను. కింద గమనిక "మీ రేషన్ మీరు తెచ్చుకోవలసిందీ" అని వుంది.

మా పనిమనిషి చెప్పింది "ఇంటికొకరు" అని చెప్పి పెళ్ళి పత్రిక ఇస్తారుట వాళ్ళల్లో. ఎంత క్లారిటీనో కదా!

పూర్వం శుభలేఖలో 'స్త్రీలకి ప్రయాణం' అని రాసి వుందా లేదా చూసుకుని ఆడవాళ్ళు బయల్దేరాల్సి వచ్చేదిట.

ఒకప్పుడు 'మేజువాణీలు' పెట్టేవారు. ఆ తరువాత ఈ అలకలూ, అలకపాన్పులతో బాజాభజంత్రీలు మోగేవి.

ఇక ఇప్పుడు 'బఫే'లొచ్చాక అందరి తిక్కలూ కుదిరాయి. వియ్యపురాలు బొట్టుపెట్టలేదనో, భోజనాలకి పిలవలేదనో, బంతిలో అగరు బత్తీలు అరటిపండుకి గుచ్చలేదనో అలిగే రోజులు కావు.

అందరూ పాలోమని పోవాలి. బలం కొద్దీ ప్లేటు అందుకుని వడ్డించుకుని, ఎదుటివాళ్ళ వీపులకీ, భుజాలకీ మన పెరుగన్నం చేతులూ, పప్పన్నం చేతులూ పూసేస్తూ తినాలి. 'బిరియానీ' అన్న వంటకం వచ్చాక, నోరంతా మసాలా వాసనే. ఆ తరువాత ఏం తిన్నా రాజకీయనాయకుడు "మైనారిటీ ఓట్ల తర్వాత మన ఓట్లు" వైపు చూసినట్లు ఉంటుంది.

ఓ ప్లేటు అందుకుని, ఆ బరువుకి ఓ వైపు ఒంగిపోయి అందులో గెడ్డపార అంత స్పూన్ పెట్టుకుని, మన కొద్దో, కావాలో అడగకుండా వరుసగా వేసే మన మడతపెట్టిన కర్చీఫ్లంటి రోటీలూ, వాటి పక్కన మిరపకాయ బజ్జీలూ, ఆ పక్క మసాలా కూరలూ, పెరుగుపచ్చడీ, ఇవన్నీ కలిపేస్తూ బిరియానీ, దానిమీదే బాదుషా, దాని వీపెక్కి వెక్కిరించే పులిహోరా, బొబ్బట్లూ, దాని రుచిని 'చెరిచే విలన్లా గోంగూర పచ్చడీ, మళ్ళీ ఇటు రద్దీలో రాలేమేమో, చార్మినార్లోలా కాసేపట్లో అల్లర్లూ, కర్ఫ్యూలూ జరిగేట్లు ఉందని, అప్పుడే వాటిమీద పోసేసుకునే సాంబారూ, దానిలో వర్షానికి తడిసిపోయిన హీరోయిన్ "జోరుమీద మోగిందీ జోడు సన్నాయి మేళం.." అని పాడుతున్నట్లు ఫెళఫెళలాడాల్సిన అప్పడం, మెత్తగా తడిసి, ట్రాన్స్‌ఫరెంట్‌గా మారి, పెరుగన్నంలో సిగ్గుగా తలదాచుకోవడం. పెరుగన్నం కాస్తా పాపికొండలమీంచి పారే గోదావరిలాంటి పాయసం రుచితో కలిసి ఉగాది పచ్చడిలా మారడం.. ఇలాంటి కంగాళినే 'బఫే' అంటాం.

ఇక్కడ వియ్యాలవారి మర్యాదలూ, బొట్లు పెట్టడాలూ ఉండవు. ఆవకాయ చేతులు బుగ్గలకి పూయడాలు తప్ప.

అసలు ఈ పెళ్ళితో ఏమీ సంబంధం లేని ఒకేలాంటి చీరలు కట్టుకున్న అమ్మాయిలు నమస్కారాలు పెడ్తూ వెల్‌కమ్ డ్రింక్స్, మంచింగ్స్ అందిస్తూ ఉంటారు. అత్తగార్లెవరో, కోడళ్ళెవరో తెలీకుండా బ్యూటీషియన్స్ అందరికీ ఒకేలాంటి మేకప్‌లు చేసి, డిజైనర్ బ్లౌజెస్ వేసి వదుల్తారు. దట్టంగా వేస్తుకున్నరంగులవల్లా, వేషధారణల వల్లా పెద్దవాళ్ళు కూడా ఎవర్నీ గుర్తుపట్టి "ఓర్నీ ఎంత పెద్దయిపోయావ్? నరసిమ్మూర్తి మూడో కొడుకువీ, గుండువారి అల్లుడివీ కదూ?" అని అడగడానికి లేదు.

ఏదో సంతలో తప్పిపోయినట్లు వెళ్ళి, తినుబండారాలు పెట్టిన స్టాల్స్ మధ్యన తిరిగి, ఏవి తినాలో ఏవి తినకూడదో తెలీక, నాలుగుసార్లు చుట్టూ తిరగడం వల్ల కళ్ళు తిరిగి, కాళ్ళు అరిగి, పెరుగన్నం తినొచ్చేస్తాం.

అసలు చిన్నప్పుడోసారి మా కాలనీలో కాలనీ ప్రెసిడెంట్‌గారి అమ్మాయి పెళ్ళి జరిగింది. నేనూ, సందానీ, బాజా మోగగానే పరిగెత్తాం, పెద్ద పెద్ద పెట్రోమాక్స్ లైట్ల మధ్య పెళ్ళికొడుకుని ఊరేగించి తీసుకొచ్చారు. అన్నం ముద్దతో కొడ్తూ, ఆడా మగా నార్త్

ఇండియన్ సంప్రదాయంలో నృత్యం చేసారు. కాళ్ళు నెప్పులు పుట్టేదాకా నిలబడి చూసి, చూసి నేనూ సందానీ ఇంటికొచ్చేస్తుంటే "అస్సలు పెళ్ళి బాగా చెయ్యలేదే ఏ.వీ రమణీ వాళ్ళు" అన్నాడు.

"అదేం? బోలెడు లైట్లు పెట్టారుగా?" అన్నాను.

"మనకి శ్రీరామనవమి పందిట్లో రాముడు ఊరేగింపు వస్తే ప్రసాదం పెట్టేవారు కదే వీళ్ళు పెట్టారా?" అన్నాడు సందానీ.

ఇప్పటికీ "మనకి శ్రీరామనవమి" అన్న సందానీ మాటలు గుర్తొస్తే అవెంత మంచిరోజులూ? 'మన శ్రీరాముడు' అని మన మతంలోనే అనుకునే రోజులు పోయాయి. అసలు ఆయన దేవుడు కాదనేవాడొకడూ. ఆయన చేసినవన్నీ తప్పులనేదొకరూ. ఏం రోజులొచ్చాయి అనిపిస్తుంది.

పెళ్ళి అనగానే కంసాలికి బంగారం ఇస్తే, పెళ్ళిరోజున సన్నాయితో వెళ్ళి మంగళసూత్రాలు తెచ్చుకునేవాళ్ళం. ఆ మేళం వాయించేది మంగళ్ళు. కొత్తకుండ చేసిచ్చేది కుమ్మరి. శకునం వచ్చేది చాకలి. పెళ్ళి చేయించేది బ్రాహ్మడు. ఊరంతా సందడే అందరూ ముఖ్యులే. అందుకే ఆ ఆచారాలు.

ఆచారాలు పోయాయి. ఆడంబరాలు మిగిలాయి. పోతే పోనీ ఆత్మీయతలన్నా మిగిలితే చాలు. మనిషికీ మనిషికీ మధ్య మమతలు లేకపోతే ఈ అట్టహాసాలకి అర్థం లేదు.

**శుభం భూయాత్.**

Post your comments

